క్లుప్తంగా

నేటి నుంచి పాలిసెట్ అడ్మిషన్లు ప్రారంభం

సింహాద్రిపురం : మండలంలోని ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలలో శుక్రవారం నుంచి 2023 పాలిసెట్ అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్, ఈ సీఈ విభాగాలలో సీట్లు కలవని.. అలాగే హాస్టల్ వసతి కలదని.. ఆసక్తి గల విద్యార్థులు ఈ కళాశాలలో చేరాలన్నారు. అలాగే పాలిసెట్ రాయని విద్యార్థులు కూడా తమ పేర్లను కళాశాలలో నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9010222184 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండలంలోని ఎల్లారెడ్డిపల్లె సచివాయలంలోని అప్పారావుపల్లె, నసంతపురం గ్రామాలలో శుక్రవారం నిర్వహిస్తున్న గడప గడకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ శేషా చలపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని వర్షం కారణంగా రద్దు చేశామన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన అందులో పేర్కొన్నారు.

'ఆడుదాం.. పాడుదాం'కు పేర్లు నమోదు చేసుకోండి

లింగాల : మండల వ్యాప్తంగా గ్రామాల్లో 17 ఏళ్లు పైబడిన యువతీ యువకులు ఆడుదాం.. పాడుదాం కార్యక్రమంలో క్రీడా పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ సురేంద్రనాథ తెలిపారు. కబడ్డీ, బాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ క్రీడలకు సచివాలయాల స్థాయిలో నిర్వహిస్తారన్నారు. తర్వాత మండలస్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలో ఈ పోటీలకు నిర్వహిస్తారన్నారు. యువతీ యువకులు వారిపేర్లను గ్రామ పంచాయతీ కార్యదర్శి వద్ద నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చెన్నూరు : స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలోని పాలెంపల్లి గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.8 వేలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదానం చేస్తున్న దాతలు

జమ్మలమడుగు : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం సిబ్బంది నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ రఫిక్ పాషా ప్రారంభించి మాట్లాడారు. యువత రక్తదానం చేయటానికి ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రిలోనే రక్తనిధి ఉంది కాబట్టి రక్తం కావలసిన వారికి ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ శ్రీలత, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రతాప్‌కుమార్, నెల్సన్ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న జేడీఏ నాగేశ్వరరావు

వేంపల్లి : వేరుశనగ పంటలో సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా గురువారం వేంపల్లె పట్టణ పరిధిలోని వేరుశనగ పంట పొలాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా వేరుశనగ పంటలో అవలంభిస్తున్న వివిధ పద్ధతులు, రక్షక పంటలు, జిగురు అట్టలు, పక్షి స్థావరాలు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులు లబ్ధి పొందేలా చూడాలి

కడప రూరల్: నవరత్నాల పథకాలకు ఈకేవైసీ చేయించి అర్హులు లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మయ్య తెలిపారు. గురువారం తన కార్యాలయంలోని ఛాంబర్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల కార్పొరేషన్ ఈడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలులో భాగంగా జగనన్న చేదోడు, వైఎస్సార్ కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, అమ్మ ఒడి తదితర పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఈ పథకాలకు సంబంధించి ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులను గుర్తించాలన్నారు.

27న ముస్లిం ఐక్యవేదిక సమావేశం

కడప రూరల్ : ఈనెల 27న గుంటూరులో నిర్వహించే ముస్లిం ఐక్య వేదిక సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ వేదిక నేతలు అబ్దుల్ కలాం, సయ్యద్ సలావుద్దీన్, అబ్దుల్ అజీజ్ తెలిపారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం పదిలం


వల్లూరు : విద్యార్థికి మాత్ర వేస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వల్లి


పులివెందులలో మాత్రలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, తదితరులు


వీఎన్‌పల్లెలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మందును వేస్తున్న రఘునాథ్‌రెడ్డి


సీకేదిన్నె : సిబ్బందితో మాట్లాడుతున్న డీఎం హెచ్ఓ, డిప్యూటీ డీఎం హెచ్ఓలు

వల్లూరు : రక్త హీనతకు కారణమైన నులి పురుగులను నివారించడం వలన ఆరోగ్యాన్ని పరి రక్షించుకోవచ్చునని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వల్లి తెలిపారు. మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో జాతీయ నులి పురుగుల నివారణా కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన నులి పురుగుల నివారణా మందు (ఆల్బెండజోల్-400 ఎంజీ) పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. నులి పురుగుల వలన ఆకలి లేకపోవడం, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి కలిగి నీరసంగా వుండటం, బరువు తగ్గడం జరుగుతుందన్నారు. భోజనానికి ముందు, తరువాత, మల విసర్జన తరువాత తప్పని సరిగా చేతులు శుభ్ర పరుచుకోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. మండలంలో మొత్తం 6890 మంది పిల్లలకు నులి పురుగుల నివారణా మందును ఇవ్వాల్సి వుండగా 6632 మందికి పంపిణీ చేసినట్లు వైద్యాధికారి ఫణీంద్ర తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జుబేద, ఎంఈఓలు లిల్లెమ్మ, విజయ్‌రెడ్డి, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : పట్టణంలోని గుంతబజార్ సచివాలయ పరిధిలోని ఇస్లాంపురంలో ఉన్న పాఠశాల విద్యార్థులకు మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలు నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6 ఏళ్ల నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న సుమారు 23 వేల మంది పిల్లలకు ఈ నులిపురుగు నివారణా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ సుధాకర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, మెడికలాఫీసర్ జీవన్‌కుమార్, సచివాలయ అడ్మిన్ దస్తగిరమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : స్థానిక తూర్పు దళితవాడలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు నులి పురుగుల మందును ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆశావర్కర్‌కె.అనసూయ, మహిళాపోలీస్ చంద్రకళలు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నులిపురుగుల మందును విద్యార్థులకు గురువారం పీహెచ్‌సీ డాక్టర్ కళ్యాణ్ దినకర్ పంపిణీ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కళాశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో 4163 మంది పిల్లలకుగానూ 3991 మంది పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : స్థానిక సంగమేశ్వర పాఠశాలలోని విద్యార్థులకు గురువారం విద్యాశాఖాధికారి జాఫర్ సాధిక్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి నులిపురుగుల నివారణ మందును పంపిణీ చేసి మాట్లాడారు. పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మహమ్మద్ తాహా, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుభాషిణి, ఉపాధ్యా యుడు రమేష్, ఏఎన్ఎం అనిత, పీహెచ్ఎం ధనలక్ష్మి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : మండలంలోని సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం నులిపురుగుల నివారణ మందులను వైద్యాధికారులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆరోగ్య విస్తరణాధికారి సుబ్రమణ్యం గోటూరు గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు నులి పురుగులవలన కలిగే దుష్పరిణామాల గురించి, వాటిని అరికట్టుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, డాక్టర్ ఎస్.ముంతాజ్, పాఠశాల ఉపాధ్యాయుడు రామచంద్రారెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇప్పెంట-1, బుగ్గలపల్లి, భగత్‌సింగ్ నగర్‌లలోని సచివాలయాల్లో జరుగుతున్న సంజీవిని కార్యక్రమాన్ని గురువారం డీఎం హెచ్ఓ డాక్టర్ నాగరాజు, డిప్యూటీ డీఎం హెచ్ఓ డాక్టర్ లక్ష్మీకర్‌లు పరిశీలించారు. అనంతరం పలు అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు మందులను అందించారు. కార్యక్రమంలో పిహెచ్‌సీ వైద్యులు రాఘవేంద్ర, సీహెచ్ఓ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలోని తాళ్లపల్లె పీహెచ్‌సీ పరిధిలోని వేంపల్లె జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు ప్రభుత్వ వైద్యులు డాక్టర్ స్వాతిసాయి తెలిపారు. మండల స్పెషలాఫీసర్ రవీంద్రనాథరెడ్డి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్ర లు వేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా, సీ హెచ్ఓ వెంకటరత్నం, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి పద్మజ, ఆశాలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలను పరిశీలించి విద్యార్థులకు అల్బెండజెల్ మాత్రలను వేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్, ఎంఈఓ శివప్రసాద్, కళాశా ల ప్రిన్సిపాల్ త్రివిక్రమరెడ్డి, పీహెచ్‌సీ డాక్టరు శ్రీనాథ్‌రెడ్డి, సూపర్‌వైజర్ ఓబులేసులు పాల్గొన్నారు.

తెలుగుతల్లి గీతంతో 'సుందరాచారి'కి చిరకీర్తి

కడప కల్చరల్ : తెలుగువారికి ప్రాణప్రదంగా మారిన మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీత రచనతో శంకరంబాడి సుందరాచారికి చిరకీర్తి లభించిందని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గురువారం శంకరంబాడి 110వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం శంకరంబాడి సుందరాచారిని ప్రసన్న కవి బిరుదుతో సత్కరించిందన్నారు. ఆయన జీవితం, సాహిత్యాలను పరిచయం చేస్తూ డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి ఆయన పేరిట గ్రంథాన్ని రాశారని గుర్తు చేశారు.

తపాలా శాఖ ద్వారా జాతీయ జెండాల విక్రయం


జాతీయ జెండా కొనుగోలు చేసిన ప్రజలు

సింహాద్రిపురం : మండలంలోని ప్రజలకు తపాలా శాఖ ద్వారా మన దేశ మువ్వన్నెల జెండాను రూ.25 అందిస్తున్నట్లు హెడ్‌పోస్ట్ మాస్టర్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. జాతీయ పతాకం కావాల్సిన వారు సింహాద్రిపురం పోస్టాఫీస్‌లో సంప్రదించి పొందాలన్నారు. ఈనెల 14వ తేదీవరకు పోస్టాఫీస్‌లో జాతీయ జెండాలు అందుబాటులో ఉంటాయన్నారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08568 286189, 9963 170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆహారంలో చిరుధాన్యాలను చేర్చుకోవాలి



మాట్లాడుతున్న కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్.బేగ్

పులివెందుల టౌన్ : ఆహారంలో చిరు ధాన్యాలను కచ్చితంగా చేర్చుకోవాలని కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్.బేగ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రమణప్పసత్రం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు చిరు ధాన్యాలపై ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ ఏడాది అంతర్జాతీయ చిరు ధాన్యాల దినోత్సవంగా జరుపుకోవడం దేశానికే గర్వ కారణమన్నారు. చిరు ధాన్యాలు సిరి ధాన్యాలు అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.ఏడుకొండలు, రామిరెడ్డి, పావన దీప్తిలు పవర్ పాయింట్ ద్వారా విద్యార్థులకు చిరు ధాన్యాల ప్రాముఖ్యతను వివరించి ఆహారంలో చిరు ధాన్యాలను కచ్చితంగా చేర్చుకోవాలని వివరించారు. తర్వాత వివిధ రకాల చిరు ధాన్యాలను పొట్టు తీయకముందు మరియు తీసిన తర్వాత ఎలా ఉంటాయో స్వయంగా చూపించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌జీఓ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న ఎన్‌జీఓ సంఘ ప్రతినిధులు, ఉద్యోగస్తులు

పులివెందుల రూరల్ : ఈనెల 21, 22వ తేదీలలో విజయవాడలో నిర్వహించే 21వ రాష్ట్ర ఎన్‌జీఓ మహాసభలను విజయవంతం చేయాలని ఎన్‌జీఓ సంఘ తాలుకా అధ్యక్షుడు జగన్నాథరెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని పులివెందుల బ్రాంచ్ కెనాల్ కార్యాలయంలో ఉద్యోగస్తులతో కలిసి ఆయన పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఎన్‌జీఓ మహాసభలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోపాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హాజరవుతారన్నారు. అందువల్ల పులివెందుల నియోజకవర్గంలోని ఎన్‌జీఓ సంఘ సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంఘ కార్యదర్శి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రభుకుమార్, శంకరయ్య, ఉద్యోగస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సైనిక వీరుల సేవలకు వందనాలు


వేంపల్లెలో మాజీ సైనికులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు


పులివెందుల మార్కెట్ యార్డు ఆవరణలో మొక్కలు నాటుతున్న వైఎస్ మాధవి, తదితరులు


నిడుజివ్వి గ్రామంలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

వేంపల్లె : మన మట్టి – మన దేశం కార్యక్రమంలో భాగంగా స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో దేశ భద్రత క్షేమం కోసం అహర్నిశలు విశేష సేవలు చేసిన మాజీ సైనికులను గౌరవించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కెప్టెన్ జోసఫ్ మనోహర్ తన 31ఏళ్ల సేవలో తాను పొందిన అనుభవనాలను, యుద్ధ సమయంలో వారి యొక్క పాత్రను వివరించారు. అనంతరం మాజీ సైనికులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సైనికుడు వీర భైరవరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి సతీమణి వైఎస్ మాధవి పేర్కొన్నారు. పర్యావరణ సంరక్షణలో భాగంగా పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంవల్ల పర్యావరణాన్ని పరిరక్షించిన ట్లవుతుందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా మనపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కోళ్ల భాస్కర్, మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండలంలోని నిడుజివ్వి గ్రామంలో నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి మొక్కలు నాటి మాట్లాడారు. ఆర్మీ వీరులు దేశ సరిహద్దుల్లో ఉంటూ దేశానికి ఎంతో సేవ చేస్తున్నారన్నారు. ఆ వీరులకు వందనం ఆజాదీ కా అమృత్ మహోత్సవ వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. అమర్ వీరులకు గుర్తుగా మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, మండల ప్రత్యేకాధికారి బ్రహ్మాయ్య, ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ, ఏపీఓ నాగసులోచన, నిడుజివ్వి గ్రామ సర్పంచ్ అనురాధ, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మానవుని మనుగడకు మొక్కలు చాలా అవసరమని వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌నాయుడు అన్నారు. గురువారం కళాశాలలో నా భూమి, నా దేశం కార్యక్రమం రెండవ రోజు కొనసాగింది. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ప్రదీప్, ప్రవంతి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప నగరంలో భారీ వర్షం

కడప కార్పొరేషన్: కడప నగరంలో గురువారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి దట్టమైన మేఘాలు కమ్ముకొని సన్నటి జల్లులతో ప్రారంభమైన వాన ఆ తర్వాత భారీగా కురిసింది. వర్షం వల్ల నగరంలోని ఆర్టీసీ బస్టాండు, గురుకుల్ విద్యాపీఠ్, అప్సర, వినాయకనగర్ సర్కిల్, ఫక్కీరుపల్లె, జిల్లా కోర్టు తదితర ప్రాంతాల్లో రహదారులపై పెద్ద ఎత్తున నీరు నిలిచింది. ఉదయం వివిధ పనుల నిమిత్తం బయటికి వచ్చిన వారు, పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఫుట్ పాత్ వ్యాపారులు 11 గంటల వరకూ దుకాణాలు తెరవలేకపోయారు. తోపుడు బండ్ల వ్యాపారులు అవస్థలు పడ్డారు. వాన వల్ల నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో భారీ స్థాయిలో నీరు నిలిచింది.

ఓటర్ల సర్వేను పారదర్శకంగా చేయండి


మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశులు

సింహాద్రిపురం : ఓటర్ల సర్వేలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా పారదర్శకంగా చేయాలని పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో తహసీల్దార్ మహబూబ్‌బాషాతో కలిసి బీఎల్ఓలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓటర్ల సర్వేలో వలంటీర్లు ఎక్కడా పాల్గొనకుండా ఉండాలని హెచ్చరించారు. ఓటర్ల జాబితాలో కుటుంబ సభ్యుల పేర్లు ఎక్కడ పడితే అక్కడ ఉన్న ఓట్లను వారి కుటుంబ ఓటర్ల వరుస క్రమంలో ఉండేటట్లు సర్వే చేయాలన్నారు. ఈ సర్వే ఈనెల 21వ తేదీకల్లా పూర్తి చేయాలన్నారు. డీటీ వెంకటరెడ్డి, బీఎల్ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : బీఎల్వోలు, సూపర్వైజర్లు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు జాబితాను వెరిఫికేషన్ చేయాలని కమలాపురం నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్టర్ అధికారి చంద్రమోహన్ తెలిపారు. గురువారం ఆయన మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలు, సూపర్వైజర్లు, కార్యాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్పెషల్ సమ్మర్ డివిజన్-2024కు సంబంధించి ఓటర్ లిస్టులో మార్పులు చేర్పులు, అలాగే తొలగింపులు, ఒకపోలింగ్ స్టేషన్ నుంచి మరొక పోలింగ్ స్టేషన్‌కు ఓటు బదిలీ వంటి వాటిని కూడా యాప్‌లో ఈనెల 21వ తేదీ లోపల పొందుపరిచి పూర్తి చేయాలని ఆయన బీఎల్ఓలకు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ పఠాన్ అలీఖాన్, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

కమలాపురం : మండలంలో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల ఎన్నిక ప్రక్రియలో భాగంగా తొలి ఘట్టం నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. మండలంలోని టి.చదిపిరాళ్ల పంచాయతీలో 1వ వార్డు, సంబటూరు పంచాయతీలో 4వ వార్డు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. చివరి రోజు గురువారం చదిపిరాళ్లలోని 1వ వార్డుకు ముద్దనూరు చిన్న బాలమ్మ, సంబటూరులోని 4వ వార్డుకు దవ్వూరు అనిల్‌కుమార్‌లు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఒక్కో స్థానానికి ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్ పత్రాలు దాఖలు చేయడంతో వారే వార్డు సభ్యులుగా ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నాయి. శుక్రవారం నామినేషన్ల పరిశీలన చేస్తామని ఆర్ఓలు తెలిపారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని అంబవరం గ్రామ పంచాయతీ పరిధిలోని 6వ వార్డుకు చెంచిరెడ్డి గారి విజయ, దిగువపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని 10 వార్డుకు నాదెండ్ల సుబ్బమ్మ నామినేషన్లను దాఖలు చేశారు. ఈ మేరకు దిగువపల్లె గ్రామ సచివాలయలో రిటర్నింగ్ అధికారి , ఈవోపీఆర్‌డీ ప్రసాద్‌కు గురువారం తమ నామినేషన్లను అందచేశారు. ఈ రెండు వార్డు స్థానాలకు చెందిన సభ్యులు మృతి చెందిన కారణంగా అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో నామినేషన్ల చివరి రోజైన గురువారం ఒక్కో స్థానానికి ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలైంది. దీంతో వైఎస్ఆర్‌సీపీకి చెందిన వీరిరువురూ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం లాంఛనమేనని చెప్పవచ్చు. కార్యక్రమంలో అంబవరం సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, దిగువపల్లె మాజీ సర్పంచ్ హరికేశవరెడ్డి, పలువురు వైఎస్ఆర్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : మండలంలో ఖాళీగా ఉన్న 5 వార్డులకు గాను 5 నామినేషన్లు మాత్రమే దాఖలు అయినట్లు ఎన్నికల అధికారి సుధాకర్ తెలిపారు. చక్రాయపేట పంచాయతీలో 2, సురభి గ్రామ పంచాయతీలో 2, గడ్డంవారిపల్లె పంచాయతీలో 1 వార్డు మెంబర్ల స్థానాలకు నామినేషన్‌లు దాఖలయ్యాయని ఆయన తెలిపారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని నంద్యాలంపల్లె పంచాయతీ మూడవ వార్డు సభ్యుడు మృతి చెందటంతో ఆ వార్డు ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వి డుదల చేశారు. ఈనెల 10వ తేదీ చివరి తేదీ కావడంతో ఆ వార్డుకు సంబంధించి ఒక నామినేషన్ వచ్చిందని ఈఓఆర్డీ పద్మనాభరెడ్డి తెలిపారు. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన అనంతరం ఏకగ్రీవ పత్రాన్ని అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ హరిప్రియ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : మండలంలోని మేడిదిన్నె సర్పంచ్, 8వ వార్డు, జె.కొత్తపల్లె 6వ వార్డు, జె.కొట్టాలపల్లె 2వ వార్డు ఖాళీగా ఉన్న స్థానాలకు గాను 6 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటరమణయ్య తెలిపారు. మేడిదిన్నె సర్పంచ్ స్థానానికి 3 నామినేషన్లు, 8వ వార్డు స్థానానికి ఒక నామినేషను, జె.కొత్తపల్లె 6వ వార్డుకు ఒక నామినేషన్, జె.కొట్టాలపల్లె 2వ వార్డుకు ఒక నామినేషన్ దాఖలైనట్లు తెలిపారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ, టి.వెలమవారిపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్లకు నామినేషన్ దాఖలు చేసినట్లు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి సోమశేఖరరెడ్డి తెలిపారు. ఇడుపులపాయ సర్పంచ్‌కు ఇద్దరు నామినేషన్ వేయగా.. అందులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తుమ్మలూరు నాగమ్మ, టీడీపీ అభ్యర్థిగా పి.లక్షుమన్న, వార్డు అభ్యర్థిగా కె.శ్రీరాములు, టి.వెలమవారిపల్లెలో మూడవ వార్డు అభ్యర్థిగా దంతలూరు సుజాతలు నామినేషన్లు వేశారు. వాటి పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈనెల 14వ తేదీన సాయంత్రం 3 గంటల్లోపు అభ్యర్థులు విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. 19వ తేదీన పోలింగ్ ఉంటుందని.. అదే రోజు 3గంటల తర్వాత కౌంటింగ్ ఉంటుందని తెలిపారు.

14న ఆందోళన

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈనెల 14న అర్హులైన పేదలకు సాగు భూములను అందించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు.